

# హిందూజీవనవాటిక

నేను రోజూ కాలేజీకెళ్లే దారిలో-సైదాబాద్‌లో-హిందూశ్మశానవాటిక వుంది. ఆ చుట్టుపక్కలంతా రొచ్చూ, రొదా, ఏదో మృత్యువు వాసన-జనం ఏడుస్తూ లోపలికెళ్లి అయిపోయిందని నిట్టూరుస్తూ బయటికి రావడాన్ని చూస్తుండేదాన్ని. మన హిందూమతంలో మరణానికి ఒక గౌరవం, దాని చుట్టూ కొన్ని అర్థవంతమైన కర్మలూ వున్నాయి. కానీ ఎవరేనా చనిపోయినప్పుడు ఏడుపూ, గందరగోళం తప్ప ఆ విధులూ, కర్మలూ నిర్వర్తించడానికి అనువైన వాతావరణం లేదు. అది రావాలి-ఎలా రావాలి-ఎలా ఉంటే బావుంటుంది-అన్న నా ఆలోచనే ఈ 'హిందూజీవనవాటిక.'

మంచానికి అతుక్కుపోయి ఎముకల గూడులా వున్న రంగాచారి ఊపిరి తిప్పుకోలేకుండా దగ్గుతున్నాడు. పక్కనే కొడుకు రామాచారి నిస్సహాయంగా చూస్తూ కూర్చున్నాడు. అతడి చేతిలో అన్నయ్య వెంకటాచారి వ్రాసిన ఉత్తరం వుంది. దాన్ని ఓ పదిసార్లన్నా చదివుంటాడు అప్పటికి. అందులో అర్థం కాకపోవడానికేమీ లేదు. చెప్పదల్చుకున్న విషయం స్పష్టంగా, కుండ బద్దలు కొట్టినట్టుగా రాశాడు.

"తమ్ముడూ,

"నాన్నగారు అవసానదశలో నన్ను చూడాలనుకొంటున్నారని నీవు రాసిన ఉత్తరం చూసి, నేను, కిందా మీదా పడి జీతం లేకుండా సెలవు తీసుకుని, అప్పు చేసుకుని అక్కడికి వచ్చాను. కానీ దైవనిర్ణయం మరోలా వుంది. నాన్నకి ఇంకా భూమ్మీద నూకలు చెల్లలేదు. దానికి నేనేమీ బాధ పడటం లేదు. కష్టం, నష్టం భరిస్తున్నవాడివి నీకే బాధ. అనారోగ్యంతో జీవచ్ఛవంలా బతికివున్న నాన్నకూ కష్టం.

"నేనిప్పుడు రాయదల్చుకున్నదేమిటంటే, పుట్టిన ప్రతి జీవీ ఎప్పుడో ఒకప్పుడు పోవలసిందే. నాన్న వంతు కూడా ఇవాళో రేపో రావచ్చు. అప్పుడు నాకు మళ్లీ టెలిగ్రాము పంపి, నా కోసం ఎదురు చూడకు. పెద్దకొడుకు సెంటిమెంటు నాకు లేదు. ఇన్నేళ్లూ నాన్న బాగోగులు నీవే చూశావు. నా తరఫున తలకొరివి పెట్టి, కార్యాలూ అవీ కానిచ్చెయ్యి. మళ్లీ డబ్బు సర్దుకుని రాలేను. ఎక్కడైనా డబ్బు సమకూరితే అది నీకే పంపిస్తాను. మనిషి పోయిన తర్వాత చాలా తతంగాలు వుంటాయి. ఆ ఖర్చులకు పనికొస్తుంది. నేనొస్తే ఆ మాత్రం డబ్బు కూడా సర్దలేను.

"ఇలా రాస్తున్నానని కోపం తెచ్చుకోకు. నాన్న సంరక్షణ ఓపిగ్గా చూస్తున్నందుకు చిన్నవాడివైనా నీకు దణ్ణం పెడుతున్నాను

"ఇట్లు
"వెంకటాచారి."

ఆ ఉత్తరం చదివిన మొదటిసారి రామాచారికి కళ్ల నీళ్లు వచ్చాయి. తర్వాత కోపం వచ్చింది. నాలుగోసారి చదివేటప్పటికి అన్నయ్య చెప్పేది నిజమేననిపించింది. ఇద్దరి దగ్గరా డబ్బు లేదు. నాన్న ఏదో చిన్న ఉద్యోగం చేసి ఇద్దర్నీ చదివించి తన బాధ్యత తీర్చుకున్నాడు. అమ్మ చిన్నప్పుడే పోయింది. అప్పులూ, ఆడపిల్లలూ, ఆస్తులూ ఏవీ లేవు. చిన్న ఉద్యోగాలు ఆధారంగా తామిద్దరూ జీవితం గడుపుతున్నారు. ఉన్న ఊరు కాబట్టి తను సర్దుకున్నట్టుగా పట్నంలో అన్నయ్య గడుపుకోలేకపోతున్నాడు.

ఆ మధ్య వేణుగోపాలాచారి... అదే తన వేలు విడిచిన మేనమామ తమ్ముడి బావమ్మరిది పోతే, ప్రక్క వీధి గదా అని వెళ్లాడు. పాడె కట్టే వాళ్ల దగ్గరి నుండి కార్యం జరిపించే బ్రాహ్మల వరకూ ఒకటే బేరం పెట్టి, ఆయన కొడుకుల్ని అందరూ పీక్కుతిన్నారు. శ్మశానం దగ్గర లోపలికి తీసుకెళ్లడానికి డబ్బు. డాక్టరు సర్టిఫికెటు అడుగుతున్నారట. కట్టెలూ, పిడకలూ, కిరోసినూ, ఆ తంతుకే... అల్లల్లాడిపోయారు. లోపలంతా ఒకటే వాసన. స్నానాలు చేసే చెరువులో మురికి పేరుకుపోయింది. అక్కడి నుండి బయటపడ్డాక నిజంగా దుఃఖం తగ్గి, ఒక రకమైన రిలీఫ్ వచ్చింది. ఆ తర్వాత వాళ్లు అస్థికలు ఏ గోదారిలో కలిపారో తనకు తెలీదు గానీ, పదమూడో రోజు వైకుంఠసమారాధనకు భోజనానికి వెళ్లినపుడు ఆయన కొడుకులు ముగ్గురూ పీక్కుపోయి, సగం అయిపోయినట్టుగా అనిపించారు. వేణుగోపాలాచారి మరీ లేనివాడేం కాదు. కాస్తో కూస్తో ఉన్నవాళ్లే. సొంత కొంప కూడా వుంది. అయితేనేం, ఆ టైములో ఎవరూ ఇల్లూవాకిలీ బేరం పెట్టరు కదా!-రేపు తన గతేం అవుతుందో అనుకుంటూ అలా కళ్లు మూసుకుని మంచం కోడుకు తల ఆన్చాడు రామాచారి. మగతగా నిద్ర పట్టింది.

రామాచారి నాన్న రంగాచారి దీర్ఘమైన శాశ్వతనిద్ర లోనికి జారుకున్నాడు. ఈ విషయం ఎలా తెలిసిందో యేమో గానీ, రామాచారి బయటకు వచ్చేటప్పటికి ఒక తెల్లటి పొడవాటి కారు వచ్చి ఆగింది. దాని పైన 'రాజహంస' అని రాసివుంది. తలుపు తీసుకుని నలుగురు యువకులు దిగి, రామాచారి దగ్గరకు వచ్చారు. అందులో ఒకడు తనను తాను పరిచయం చేసుకున్నాడు. "చారిగారూ! నా పేరు ప్రభాకర్. మీ నాన్నగారు పోయిన సంగతి మాకు తెలిసింది. ఎలా అని అడక్కండి. మాది ఒక స్వచ్ఛందసంస్థ. కొంతమంది కలిసి, డబ్బు పోగు చేసి, ఇలా ఎవరింట్లో మరణం సంభవించినా వెళ్లి సహాయం చేస్తూవుంటాము. మీకు ఎలాంటి ఇబ్బందులూ, ఖర్చూ లేకుండా మీ నాన్నగారి దహనసంస్కారాలు జరిపించే పూచీ మాది" అన్నాడు వినయంగా.

"కానీ, ఇప్పుడు ఇలా ప్రాణం పోగానే... ఎలా? బ్రాహ్మణుడు వచ్చి తంతు జరిపించాలి కదా?"

"మా సంస్థలో బ్రాహ్మణుడు కూడా వున్నాడు. మీరు సరేనంటే, మా కార్యక్రమాలు మేం ప్రారంభిస్తాము."

రామాచారి ఏమన్నాడో అతనికి తెలిసే లోపలే నలుగురు యువకులూ లోపలికి వచ్చి,

రంగాచారి శరీరాన్ని మంచం మీది నుండి దింపి, చాప వేసి పడుకోబెట్టారు. లోపలికి వెళ్లి, వెంకటలక్ష్మిని అడిగి, దీపం వెలిగించి, తెచ్చి తల దగ్గర పెట్టారు. నీళ్ల గది లోనికి వెళ్లి ఒకడు తలారా స్నానం చేసి, ఒక బిందెతో మంచినీళ్లు ముంచుకుని తెచ్చేలోగా మిగిలినవాళ్లు మంత్రాలు చదవడం ప్రారంభించారు. వచ్చిన బంధువుల్నీ, ఇరుగుపొరుగునీ ఒక పక్కగా నిలబెట్టారు. తంతుకి కావలసిన వస్తువులన్నీ వాన్‌లో తమతోనే తెచ్చుకున్నారు. నువ్వులు, బియ్యం, దర్భ, చిన్న కుండ, బొగ్గులు, తాడు ముక్క, కొత్తబట్టలూ... ఇంకా ఏవేవో ఒక అట్ట పెట్టెలో నుండి తీస్తున్నారు. ఒకతను మంత్రం చదువుతూంటే, మరొకతను శవానికి స్నానం చేయించి కొత్త బట్ట కప్పాడు.

అంతలో వారు చెప్పినట్టుగా రామాచారి తలంటు స్నానం చేసి తడిబట్టతో వచ్చాడు. పిలిచినట్టుగా మంగలి వచ్చి జుట్టు తీసేశాడు. చిన్న కుండలో నిప్పులు తయారయ్యాయి. మంత్రాలు చదువుతూ రంగాచారి శరీరాన్ని పాడె మీదకు చేర్చారు. దర్భతో కాలి బొటనవ్రేళ్లు రెండూ కట్టారు. ముక్కులో, చెవుల్లో దూది పెట్టారు. నుదుటిపై గంధం, కుంకుమ బొట్టు పెట్టారు. గొంతులో తులసితీర్థం, గంగోదకం పోశారు. మెడలో పూలమాల వేసి, పాడె మీద వీలున్న చోటంతా చక్కగా చామంతులూ, గులాబీలూ అమర్చారు. ఒక్క నిమిషం రామాచారికి తన తండ్రి పూలపాన్పు మీద హాయిగా పడుకుని తనను చూసి నవ్వుతున్నట్టనిపించి కళ్లలో నీళ్లు తిరిగాయి. ఎవరీ కుర్రాళ్లు? ఏ దేవదూతలు పంపారు? అనుకుంటుండగా, కావలసిన వాళ్లందరూ శవం చుట్టూ ప్రదక్షిణలు చేసి బియ్యం గింజలు చల్లారు. "రామ్ నామ్ సత్య హై" అని ప్రభాకర్ అంటే అందరూ గొంతులు కలిపారు. మరో గొంతు "ఓం నమో భగవతే వాసుదేవాయ" అంటే, ఇంకెవరో "హరహర మహాదేవ" అన్నారు. భగవన్నామం గాలిలో తేలి వాతావరణమంతా పునీతమైనట్టనిపించింది. పాడెను మెల్లగా లేపి, వాన్ లోనికి ఎక్కించారు. ఎవరో చేయి పట్టుకుని రామాచారిని కూడా లోపల కూర్చోబెట్టారు. ఇదంతా కలా, నిజమా? అనుకుంటూండగానే వాన్ శ్మశానం ముందుకొచ్చి ఆగింది.

'హిందూజీవనవాటిక' అని పైన రాసివుంది. "ఇదేమిటి? ఈ దారి గుండా నేను రోజూ ఇంటికెళ్లేవాణ్ని కదా! 'హిందూ శ్మశానవాటిక' అని రాసివుండేది కదా!" అని అనుకున్నాడు రామాచారి. వాన్ గేటు దగ్గర ఆగగానే, తలుపులు తీశాడు వాచ్ మేన్. తెల్లటి యూనిఫాం వేసుకుని నేవీ ఆఫీసర్‌లా వున్నాడు. రామాచారి ఊహల్లో హరిశ్చంద్ర నాటకంలో వీరబాహు మెదిలాడు. వాచ్‌మేన్ దగ్గరగా వచ్చి చేయి చాపాడు. ప్రభాకర్ అతని చేతిలో ఒక కవరు పెట్టాడు. అర్థం కానట్టు చూశాడు రామాచారి.

"ఇది డాక్టరు సర్టిఫికెట్. మరణించిన వ్యక్తిది సహజమరణం అని ధ్రువీకరించే పత్రం. హత్యో, ఆత్మహత్యో చేసి అంత్యక్రియలు చేసేయకుండా ఇది ఒక చెక్" అని వివరించాడు ప్రభాకర్.

వాన్ నుండి జాగ్రత్తగా శవాన్ని దింపారు. చుట్టూ పూలచెట్లూ, పచ్చటి పచ్చిక. ఎంతో అందమైన వనంలా వుంది. విశాలమైన బయలులో ఒక మూల చిన్న చెరువు. దాని పక్కన శివాలయం. మైకులో ఘంటసాల గొంతుతో శ్రావ్యంగా భగవద్గీత శ్లోకాలు వినిపిస్తున్నాయి.

"వాసాంసి జీర్ణాని యథా విహాయ
నరాని గృహ్ణాతి నరోపరాణి
శథా శరీరాణి విహారజీర్ణా,
సన్యాని సంయాతి నవాని జేహి."

మానవుడు జీర్ణమైన పాత వస్త్రములను వదలి క్రొత్తవాటిని వేసుకున్నట్లే, జీవుడు పాత శరీరాన్ని వదలి క్రొత్తదాన్ని ఎన్నుకుంటాడు. బట్టలు పాతబడడం ఎంత సహజమో శరీరానికి ముసలితనము రావటమూ అంతే సహజము. జననమరణాలంటే ఒక శరీరాన్ని వదలి మరొకదాన్ని స్వీకరించటమే,

తండ్రి శవాన్ని చూస్తూ, శ్లోకం వింటున్న రామాచారికి ఏదో జ్ఞానోదయమై, దుఃఖం తగ్గినట్టనిపించింది. తన తండ్రి చనిపోలేదు. మరో కొత్త శరీరంలో ప్రవేశించి రోగం-రొష్టూ లేకుండా సంతోషమైన జీవితం గడపబోతున్నాడన్నమాట.

నీళ్లు నిండిన కళ్లతో ప్రక్కకు తిరిగి చూస్తే, ప్రభాకర్‌తో వచ్చిన మరో కుర్రాడు-విశ్వనాథ్ కాబోలు అతని పేరు-రామాచారి భుజం మీద ఆప్యాయంగా చేయి పెట్టాడు.

"అబ్బాయీ! ఇలా అడుగుతున్నానని ఏమీ అనుకోకు. నేను ఎన్నో రకాల స్వచ్ఛందసంస్థల గురించి విన్నాను. కానీ ఇలాంటి కార్యక్రమాలు అంటే, మరణం అనేది-ఎవరిదైనా, మనస్సుకు ఆహ్లాదం కలిగించని విషయం కదా? వీటిని చేయాలని ఎందుకనుకున్నారు?"

"చారిగారూ! మీతో అన్ని విషయాలూ చెప్పడం కుదరలేదు. మా సంస్థ పేరు 'పునరుజ్జీవనం,' మేము ఇంటింటికీ వెళ్లి నేత్రదానం గురించీ, మూత్రపిండాలు, కాలేయం వంటి అవయవాల్ని మనిషి పోయాక ఇతరులకు ఎలా అమర్చవచ్చో, దాని వల్ల 'అమరత్వం' ఎలా పొందవచ్చో వివరించి, నచ్చజెప్పి, వాళ్లు సరేనంటే అనుమతిపత్రాల మీద సంతకం

## డా॥ భార్గవీరావ్



తీసుకుంటాము. కానీ కుటుంబంలో వ్యక్తి మరణించినప్పుడు ఇలాంటివి ఎవ్వరికీ జ్ఞాపకం రావు. మేము తెలుసుకుని, వాళ్ల దగ్గరికి డాక్టర్లను తీసుకువెళ్లి, 'దానం' తీసుకుంటాము. ఆ కుటుంబానికి అంత్యక్రియలు చేయడంలో సాయం చేస్తాము. కానీ మిమ్మల్ని ముందే సంప్రదించలేదు కదా! అందుకని ఆ మాట ఎత్తలేదు."

"కాని మా నాన్నగారు చాలా ముసలివారు. వారి కళ్లు పనికొస్తాయా?"

"నిస్సందేహంగా. కంటిలో ఒక భాగాన్ని మాత్రమే తీసి కళ్లు లేని వాళ్లకు అమరుస్తారు. కానీ మనం వారి అనుమతి తీసుకోలేదు కదా! ఇక మిగిలిన కార్యక్రమాలు చూద్దాం."

"బాబూ, విశ్వనాథ్! నీవు రేపే మా ఇంటికి రా. నా శరీరాన్నంతా వైద్యవృత్తికి వుపయోగపడేలా-అన్ని అవయవాలూ దానం చేసేస్తాను" అన్నాడు ఉద్వేగంతో.

"అలాగే. ఇప్పుడు మిగిలిన పనులు చేశాక మాట్లాడుకుందాం" అన్నాడు విశ్వనాథ్.

పాడె మళ్లీ కదిలింది. బ్రాహ్మణులు ఏవో మంత్రాలు చదువుతున్నారు. వాళ్లు తాంబూలం కానీ, దక్షిణ కానీ అడగలేదు. వాళ్లకి కావల్సిన సరంజామా అంతా ప్రభాకర్ బృందం వాళ్లే అందజేశారు. గరుడపురాణంలోని ప్రేతకాండం శ్లోకాలట-మళ్లీ వినిపించసాగాయి. మెల్లగా శవాన్ని తీసి శుభ్రంగా పాలరాతి గచ్చుతో కట్టిన గదిలోనికి తీసుకెళ్లారు. అక్కడ ఎలక్ట్రిక్ క్రిమెటోరియంలో పడుకోబెట్టి స్విచ్ వేశారు. అప్రయత్నంగా కళ్లు మూసుకుని చేతులు జోడించాడు రామాచారి. కళ్ల నుండి నీళ్లు కారిపోతున్నాయి. అది తండ్రిని పోగొట్టుకున్న దుఃఖమో, అతని అంత్యక్రియలు ప్రశాంతంగా జరిగాయన్న సంతోషమో అతనికే అర్థం కాలేదు. మంచిగంధం వాసనలు అతన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. అతను కళ్లు తెరిచేసరికి రంగాచారి పార్థివశరీరం బూడిదైపోయింది. అతన్ని చేయి పట్టుకుని మెల్లగా నడిపించి, బయటకు తీసుకువచ్చి, ఒక చెట్టు నీడలో కూర్చోబెట్టారు. అతని ప్రక్కన ప్రభాకర్ కూర్చున్నాడు.


"రామాచారిగారూ! మీ నాన్నగారి అంతిమయాత్ర పూర్తయింది. ఒక కొడుకుగా మీ పాత్ర మీరు పోషించి తండ్రి ఋణం తీర్చుకున్నారు. అక్కడ చెరువులో స్నానం చేసి, శివాలయంలో దణ్ణం పెట్టుకుని రండి. అభ్యంతరం లేకపోతే ఒక కప్పు వేడి కాఫీ తాగండి. పొద్దుటి నుండి ఏమీ తీసుకోలేదు. అంతలో మా వాళ్లు అస్థికలు సేకరించి తెస్తారు. ఎల్లుండి మా వాన్‌లోనే మిమ్మల్ని కృష్ణానదికి తీసుకెళ్లి నిమజ్జనం చేయిస్తాం. మీరేమైనా దానధర్మాలు చేయాలనుకున్నా, మా సంస్థ అప్పు కానీ, విరాళం కానీ ఇస్తుంది. దేనికీ హైరాన పడకుండా ప్రశాంతంగా భగవద్ధ్యానం చేసుకోండి."

ప్రభాకర్ మాటలు భగవద్గీతలా అనిపిస్తున్నాయి. కలలో వినిపించినట్టుగా, మత్తుగా, మెత్తగా వినిపిస్తూంటే...

ఎవరో ఎడతెరిపి లేకుండా దగ్గుతున్న శబ్దానికి చటుక్కున కళ్లు తెరిచాడు రామాచారి. తండ్రి ఊపిరి సలుపుకోలేనంతగా దగ్గుతున్నాడు. రామాచారి లేచి వచ్చి తండ్రి నోటికి నీళ్ల గ్లాసు అందించాడు. "అయ్యో! ఇదేమిటి, ఇలాంటి కలొచ్చింది? హిందూజీవనవాటిక నిజంగా వుందా? మన సమాజంలో వీరబాహుల్లాంటి వాళ్లు ప్రాణాలున్నవాళ్లనే పీక్కుతింటున్నారు. ఇక శవం వస్తే, వాళ్లకి పండగే! గుండెలు బాదుకుని, ఏడ్చి మొత్తుకుని, అది చెయ్యలేదేం, ఇలా చెయ్యలేదేం అని అటూ ఇటూ ఈడుస్తుంటే కానీ అంత్యక్రియలు పూర్తి కావు. అసలు డబ్బుల్లేకుండా పాడెవరు కడ్తారు? ప్రభాకర్ ఎవరు? ఏమా స్వచ్ఛందసంస్థ? సింహాల క్లబ్బులూ, నక్కల క్లబ్బులూ డబ్బు దండుకుని ఏవో వాళ్లకు తోచిన సమాజసేవలు చేస్తారు. కానీ ఇలాంటి పనులు చేపట్టగలరా?

"నాన్నా! నా ఈ కల-హిందూజీవనవాటిక నిజమయ్యేదాకా ప్రాణాలతో వుండగలవా? బ్రతుకులో నీకు లేని ప్రశాంతత అంత్యక్రియల్లోనైనా దొరుకుతుంది" అనుకున్నాడు రామాచారి. ■

# పెళ్లికి ముందు వైద్యపరీక్షలు అవసరమా!?



'పెళ్లంటే నూరేళ్లపంట' అన్నారు కదా! అది పండాలంటే కాబోయే దంపతులు వైద్య పరీక్షలు జరిపించుకోవాలి మరి. ఒకప్పుడు పెళ్లికి ముందు వైద్యపరీక్షలు జరపవలసి వస్తే పెద్దలు ఏదో అనుమానాలు వ్యక్తం చేసేవారు. దీంతో వైద్యపరీక్షలకు అంతగా ప్రాధాన్యత ఇచ్చేవారు కాదు. కాని ఈ ఆధునికయుగంలో కాబోయే దంపతులకు వైద్య పరీక్షలు తప్పనిసరిగా పరిణమించింది. ఎయిడ్స్ మహమ్మారిలా వ్యాపిస్తున్న ఈరోజుల్లో పెళ్లి చేసుకునే ముందు అమ్మాయి, అబ్బాయి ఇద్దరు కూడా వైద్యపరీక్షలు జరిపించుకోవడం ఉత్తమం. 15-24 ఏళ్ల వయసున్న యువతీయువకుల్లో ఎక్కువశాతం ఎయిడ్స్‌వ్యాధి సోకినట్లు తాజా సర్వేలు వెల్లడిస్తున్నాయి. అంతేకాకుండా వంశపారంపర్యంగా కూడా కొన్ని వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. ఇది పుట్టబోయే బిడ్డలపై ప్రభావం చూపుతుంది. ఇరుకుటుంబాల ఆరోగ్య చరిత్ర తెలుసుకుంటే పుట్టబోయే బిడ్డలు కూడా ఆరోగ్యంగా పుడతారు. ఇటీవల జరిగిన ఓ సంఘటన పెళ్లి పీటలపై పెళ్లి ఆగిపోయేలా చేసింది. అదేమిటంటే పెళ్లికొడుకుకు ఎయిడ్స్ వుందన్న ఒక్క ఫోనుకాల్‌తో పెళ్లి ఆగిపోయింది. తీరా అబ్బాయికి వైద్యపరీక్షలు జరిపించగా ఎయిడ్స్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీంతో పెళ్లికూతురు ఆ మూడుముళ్ల బంధం నుంచి విడివడి ఎయిడ్స్‌కు బలికాకుండా తప్పించుకుంది. కావున కాబోయే దంపతులు వైద్యపరీక్షలు జరిపించుకోవడం అన్నివిధాలా శ్రేయస్కరం!

జోషి